క్లుప్తంగా

బొమ్మరిల్లు ఆశ్రమానికి నిత్యావసరాల అందజేత

నాగులుప్పలపాడు: ఒంగోలులోని బొమ్మరిల్లు ఆశ్రమానికి నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన జ్యోతుల అనీల్ కుమార్, గౌరీ దంపతులు శనివారం నిత్యావసర సరుకులు అందజేశారు. వారి కుమార్తె హాసినీ జన్మదినం సందర్భంగా ఆశ్రమానికి వెళ్లి రూ.15 వేల విలువైన నిత్యావసరాల అందజేశారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదు

సంతనూతలపాడు:సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని బీవీ సుబ్బయ్య హైస్కూల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్, మాదక ద్రవ్యాలపై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ, ప్రకాశం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, గ్రో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హెచ్ఎం వై.వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. హెచ్ఐవీ ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా రాదు..? హెచ్ఐవీ ఎయిడ్స్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా ఎలా జీవించాలో వివరించారు. గ్రో ప్రాజెక్టు మేనేజర్ షేక్ పీర్ బాషా, ఓఆర్‌డబ్ల్యూ వెంకటరావు, ఆర్.భవాని, బ్రాహ్మణి, మంగ, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబ విలువలు తెలిపిన వంశవృక్షం నాటకం



వంశవృక్షం నాటకంలోని ఓ సన్నివేశం

ఒంగోలు మెట్రో: జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం ఒంగోలు వారి ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమాలలో ముందుగా ఎస్పీబీ మెలోడీస్ వారి సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ సభ్యులుగా నియమింబబడిన పేముల విజయనిర్మలను సత్కరించారు. శనివారంతో సాంస్కృతిక కార్యక్రమాలు 100 నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా రంగ భూమి కళాకారులకు అభినందనలు తెలిపారు. అనంతరం సుదర్శనం నెల్లూరు వారి వంశ వృక్షం నాటకం ప్రదర్శించగా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కుటుంబ విలువలు ఇతివృత్తంగా సాగిన ఈ నాటకం అలరించింది. ఆయా కార్యక్రమాలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు, జిల్లా రంగ భూమి కళాకారుల సంఘ కార్యవర్గ సభ్యులు అంగలకుర్తి ప్రసాదు, ధేనువకొండ సుబ్బయ్య, వాకా సంజీవరెడ్డి, పి.వెంకటరామయ్య, మాకా ఆంజనేయులు, రిమ్స్ బాబూరావు, రంగారావు, నరేంద్ర, దిగ్విజయ్, వై.పూర్ణచంద్ర, పాదిలి బాల గురవయ్య, సబ్బు శ్రీను పాల్గొన్నారు.

స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కనిగిరిరూరల్: దివ్యాంగురాలి స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావు శనివారం డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మల్లికార్జునరావు బాధితులతో కలిసి డీఎస్పీకి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ దివ్యాంగురాలైన(అంధురాలు) ఛీయాద్రి బుజ్జీకి 2012లో సర్వే నెంబర్ 895, 899లో 75వ ప్లాట్ నెంబర్‌తో ఇంటి పట్టా ఇచ్చారన్నారు. ఆమెకు ఇచ్చిన ఇంటి పట్టా స్థలాన్ని చల్లగిరిగిల్లకు చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. దివ్యాంగురాలైనా బుజ్జీకి చెందిన ప్లాట్‌ను దొంగ వేలిముద్రలతో కొందరు ఫోర్జరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దివ్యాంగుల పట్టాలను ఫోర్జరీ సంతకాలు, వేలిముద్రలతో అమ్మకాలు చేస్తున్న వారిపై వికలాంగుల హక్కుల చట్టం 2016 సెక్షన్ 92ఏ కింద క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేరుగు చందనాగ్



కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేరుగు చందనాగ్, నాయకులు

మద్దిపాడు: రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల నిర్వహణను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ పీపీపీ విధానాన్ని తీసుకురావడాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేరుగు చందనాగ్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా శనివారం మద్దిపాడు మండలంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మద్దిపాడు బీసీ కాలనీలో మేరుగు చందనాగ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ కూటమికి తగిన బుద్ధి చెప్పే విధంగా ప్రజలందరూ సంతకాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వాకా అరుణా కోటిరెడ్డి, నాయకులు బెజవాడ రాము, కాకర్ల వెంకటేష్, మోరబోయిన సంజీవరావు, పల్లపాటి అన్వేష్, వెంకటేష్, బొమ్మల రామాంజనేయులు, రాయపాటి విల్సన్, నాదెండ్ల మహేష్, దుడ్డు వినోద్, ఆరబోలు ప్రభుదాస్, వేముల సుబ్బారావు, అంబటి నరేంద్ర, మస్తాన్ వలి, ఘాఫూర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు

బాలికలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలి



బాలికలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సువర్ణ

కొత్తపట్నం: బాలికలు చిన్న వయసు నుంచే అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని సువర్ణ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామంలోని కేజీబీవీలో శనివారం వేడుకలు నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సువర్ణ మాట్లాడుతూ బాలికలు సాధికారత సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. బాలికల చట్టాలు, వారికి ఉన్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. బాలికల అభివృద్ధికి అవరోధాలు, లక్ష్యాలను చేరుకునే మార్గాలు అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు న్యాయ, పర్యవేక్షణ అధికారి బి.రత్నప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మీరున్నిసా బేగం, సైన్స్ టీచర్ కె.శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం వర్కర్ శామ్యూల్, సార్డ్స్ ఎన్‌జీవో ప్రతినిధులు స్వప్న, బాలకాశమ్మ పాల్గొన్నారు.

పేర్నమిట్టలో...

సంతనూతలపాడు:అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్టలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ పేర్నమిట్ట సూపర్‌వైజర్ సీహెచ్ అనూరాధ అధ్యక్షత వహించి కిశోర బాలికలకు బాల్య వివాహాలు చేయడం వలన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆరోగ్యం, నాణ్యమైన విద్య, బాల్యవివాహాల నివారణ, అక్రమ రవాణా, తదితర వాటిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూరాధ కిశోర బాలికలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆర్.సుజాత, కామేశ్వరి, గౌసియా, శ్యామల కుమారి, పి.సుజాత, అనసూర్య, జ్యోతి, భువన, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రకాశంకు జీజీహెచ్‌లో చికిత్స



జీజీహెచ్ ఐసీయూలో అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్న పాస్టర్ ప్రకాశం

ఒంగోలు టౌన్: కనిగిరి మండలం మాచవరం గ్రామానికి చెందిన చర్చి పాస్టర్ కుడుముల ప్రకాశం ఒంగోలు జీజీహెచ్‌లో అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్నారు. గత ఆగస్టు 5వ తేదీ ఆయనపై గ్రామంలో దాడి జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని, శనివారం ఒంగోలులో ఉన్నట్లు తెలిసి తామంతా వచ్చామని ఆయన సోదరి అలీషమ్మ తెలిపారు. అయితే, ఆయనకు ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగానే ఆపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారని కన్నీరు పెట్టుకున్నారు. ప్రస్తుతం జీజీహెచ్‌లోని ఐసీయూలో ఆయన చికిత్స పొందుతున్నారు. తన సోదరుడికి ప్రాణభిక్ష పెట్టాలని అలీషమ్మ వేడుకుంటున్నారు. మాచవరంలో కొంతమంది వ్యక్తులు ఆయనను హతమార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా పాస్టర్ ప్రకాశం విడుదల చేసిన ఒక వీడియో సోషల్ మీడియాలో ట్రోల్ అవుతోంది. తనపై దాడి చేసి నోట్లో మూత్రం పోశారని ఆ వీడియోలో ఆయన ఆరోపించడం సంచలనం సృష్టిస్తోంది.

విద్య, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ జవహర్

చీమకుర్తి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చీమకుర్తిలోని గురుకుల బాలికల పాఠశాలలో శనివారం బాలికా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, బాలికల హక్కులు అనే అంశాలపై జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సమాజంలో బాలికలందరికీ చదువుకునే హక్కు కల్పించాలన్నారు. స్త్రీ వైద్య నిపుణులు వీ ప్రశాంతి, లక్ష్మీశారద మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, రుతు సమస్యలపై అవగాహన కల్పించారు. జేవీవీ నాయకులు నల్లూరి వెంకటేశ్వరరావు, చలువాది రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా డిజిటల్ బుక్



నాయకులతో మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్

టంగుటూరు: కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు బనాయిస్తూ అరాచక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. పార్టీ శ్రేణులకు అండగా ఉండేందుకే డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని చెప్పారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు ఆధ్వర్యంలో నాయకులతో కలిసి డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరణ, గ్రామ అనుబంధ విభాగ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ అరాచకాలకు పాల్పడే కూటమి పార్టీ నాయకులకు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధి మరిచి కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ 15 నెలల కూటమి ప్రభుత్వ అరాచక పాలనలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, తమ ప్రభుత్వంలో పనిచేసిన నాటి అధికారులపైనా అక్రమ కేసులు పెడుతూ అనాగరికంగా వ్యవహరించారన్నారు. ఇదే తరహాలో స్థానిక మంత్రి మర్లపాడు నాయకులపై అక్రమ కేసు పెట్టి జైలు పాలు చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో మేదరమిట్ల భరత్‌రెడ్డి, ఏలూరి వంశీ, తక్కిలపాటి సుధాకర్, వలివర్తి శ్రీనివాసరాజు, కొండపి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పరిటాల సునీల్, పేరూరి కమళాకర్, కొమ్ము సురేంద్ర, దేవరపల్లి వరుణ్, శ్రీపతి విజయ్, దావులూరి సునీల్, పందిటి అశోక్, తదితర నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్లు ఎక్కడ..?



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కుర్చీ ఖాళీగా ఉన్న దృశ్యం

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్యం చేసేందుకు నర్సులే దిక్కయ్యారు. ప్రభుత్వ వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం సుమారు 10 రోజుల నుంచి విధులు బహిష్కరించారు. దీంతో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పీజీ కోర్సు చదివే జూనియర్ డాక్టర్లను తాత్కాలికంగా నియమించింది. కానీ సదరు డాక్టర్లు విధులకు హాజరు కాకుండా డుమ్మాకొడుతున్నారు. అంతేకాక వీరు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విధులు నిర్వహించి తిరిగి కాలేజీకి వెళ్లాల్సి ఉంది. దీంతో వీరు సాధ్యమైనంతవరకు ఆస్పత్రులకు రాకుండా డుమ్మా కొడుతున్నారు. ఈ ప్రకారం డాక్టర్ రాకపోవటంతో రోగులకు నర్సులే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.



మాట్లాడుతున్న ఐద్వా మండల కార్యదర్శి మాలతి

హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి

సంతనూతలపాడు: హక్కుల సాధన కోసం సమరశీల ఉద్యమాలకు మహిళలు సిద్ధం కావాలని ఐద్వా మండల కార్యదర్శి ఎస్.మాలతి పిలుపునిచ్చారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 16వ మహాసభలు అనంతపురంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరగనున్న సందర్భంగా సంతనూతలపాడులోని అంబేద్కర్‌నగర్లో శనివారం ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ మహాసభలకి రాష్ట్ర నలుమూలల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. గత మూడేళ్ల కాలంలో జరిగిన ఉద్యమాలపై సమీక్షించుకుని భవిష్యత్తులో మరింత శక్తివంతమైన ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లటానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయని చెప్పారు. మహిళలపై జరిగే హింస, కుటుంబాలను గుల్ల చేస్తున్న మద్యం, మత్తు పదార్థాలు, మహిళలకు తక్కువ వేతనాలు, మైక్రో ఫైనాన్స్ వడ్డీ వ్యాపారం, పొదుపు పేరుతో దోపిడీ, ఆంధ్రుల భవిష్యత్తును, జీవితాలను నాశనం చేస్తున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, తదితర సమస్యలపై తీర్మానాల కోసం లోతైన చర్చలు జరుగుతాయని అన్నారు. స్త్రీల రక్షణ కోసం అనేక చట్టాలను పోరాడి సాధించుకున్నామని, ఆస్తి హక్కు, వరకట్న నిరోధక చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, గృహహింస నిరోధక చట్టం, నిర్భయ వంటి అనేక చట్టాలను సాధించుకోవటానికి అనేక ఉద్యమాలను ఐద్వా చేపట్టిందని గుర్తుచేశారు. రాబోయే కాలంలో మరింత ముందుకు ఉద్యమాలను తీసుకెళ్లే విధంగా మహాసభలను జయప్రదం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐద్వా మండల ఉపాధ్యక్షురాలు కె.బుజ్జి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి గ్రానైట్ ఫ్యాక్టరీల సమస్యలు

చీమకుర్తి: చీమకుర్తి పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల వారి సమస్యలను శనివారం విజయవాడలో గనులు, భూగర్భ వనరుల శాఖామంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. గ్రానైట్ సీనరేజీ వసూళ్లను ఏఎంఆర్ ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం అప్పగించడంతో రాయల్టీతో పాటు అదనంగా రెట్టింపు రాయల్టీ చెల్లించమని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. రాయల్టీ భారం కారణంగా ఈ నెల 1వ తేదీ నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం నాటికి సమస్య పరిష్కరిస్తానని మంత్రి రవీంద్ర హామీ ఇచ్చినట్లు గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో యర్రగుంట్ల శ్రీనివాసరావు, కాట్రగడ్డ రమణయ్య, తదితరులు ఉన్నారు. అదేవిధంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాసరావు కూడా శనివారం విజయవాడలో మంత్రి కొల్లు రవీంద్రను కలిసి ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడికి నిరసన



సంతనూతలపాడు బస్టాండ్లో కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న అంబేడ్కర్ సంఘ సభ్యులు

- సంతనూతలపాడులో కొవ్వొత్తుల ర్యాలీ

సంతనూతలపాడు: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలోని దేవళంకోట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి దహనం చేయడాన్ని ఖండించడంతో పాటు సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మతోన్మాదులు చెప్పులు విసరడాన్ని నిరసిస్తూ శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. సంతనూతలపాడులోని బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సంతనూతలపాడు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దాసరి ప్రకాశం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు మార్పుడి పాపారావు, మార్పుడి రామాంజనేయులు, మార్పుడి మధు, మార్పుడి రామాంజి, బల్లికురవ అనీలు, గోగులమూడి పృథ్వి, దర్శి ప్రేమ్‌చంద్, వెంకటేష్, ప్రశాంత్, బీఎస్పీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎడ్లూరి నాగేశ్వరరావు, బల్లికురవ రాజేష్, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, మార్పుడి జనార్దన్, ఎస్.వెంకటేశ్వర్లు, సీపీఎం మహిళా నేత ఎస్.మాలతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ యువకులపై పోలీసుల క్రూరత్వం

- మార్టూరు సీఐ, పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు చేయాలని డిమాండ్



ఫిర్యాదును ప్రదర్శిస్తున్న నాగేంద్రం, తదితరులు

ఒంగోలు వన్‌టౌన్: మార్టూరు మండలం డేగర్లమూడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన ఎస్సీ యువకులకు అరికాళ్ల కోటింగ్ ఇచ్చిన సీఐ, కానిస్టేబుళ్లు, విగ్రహం తొలగించిన పంచాయతీ కార్యదర్శిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాధితులు పోలీసులకు పంపిన ఫిర్యాదును ప్రదర్శించారు. టీడీపీకి చెందిన కమ్మ కులస్తులు జాగర్లమూడి శ్రీనివాసరావు, గోరంట్ల శేషగిరి ప్రోద్బలంతో పంచాయతీ కార్యదర్శి బొమ్మనబోయిన శ్రీనివాసరావు అంబేడ్కర్ విగ్రహం తొలగించారన్నారు. విగ్రహం స్థానంలో పెట్టిన ఫొటోను కూడా కార్యదర్శి తీసుకెళ్లిపోయాడన్నారు. స్థానిక యువకులు అల్లాడి ప్రమోద్ కుమార్, జ్యోతి పోతులూరిలు దీనిపై కార్యదర్శి శ్రీనివాసరావును ప్రశ్నించారని టీడీపీ నాయకులు ప్రోద్బలంతో స్థానికుడైన అన్నం హనుమంతరావు పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశాడన్నారు. దానిపై మార్టూరు సీఐ శేషగిరి, కానిస్టేబుల్ సాగర్, వలీలు ఎస్సీ యువకులు అల్లాడి ప్రమోద్ కుమార్, జ్యోతి పోతులూరిని గత సెప్టెంబర్ 26వ తేదీ పోలీసు స్టేషన్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టారన్నారు. గాయపడిన యువకులు 27వ తేదీ మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారన్నారు. ఈ సంఘటనలో నిందితులందరిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బాధితులు స్పీడ్ పోస్టు ద్వారా మార్టూరు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు పంపారని, తగిన చర్యలు తీసుకోవాలని నీలం నాగేంద్రం డిమాండ్ చేశారు.

బింగినపల్లి చెరువును కాపాడండి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రవికుమార్‌రెడ్డి

సింగరాయకొండ: బింగినపల్లి చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి, ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, దీంతో చెరువు కట్టల భద్రతకు ముప్పు వాటిల్లుతుందని వైస్ ఎంపీపీ ఎస్ రవికుమార్‌రెడ్డి, పాకల-1 ఎంపీటీసీ జి.అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ బింగినపల్లి చెరువు కింద సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉందని, ఆ చెరువులో అక్రమ తవ్వకాలతో చెరువు కట్టలు ప్రశ్నార్థకంగా మారాయని, ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అక్రమ తవ్వకాలను అడ్డుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. చెరువు కట్ట పక్కనే రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయని, వాటి పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు అధ్వాన్నంగా ఉన్నాయని, దీంతో దోమల బెడద ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆరోపించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి గుంతలమయమై ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని ముందస్తు చర్యల్లో భాగంగా గుంతలు పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సింగరాయకొండ- పాకల రోడ్డు అధ్వాన్నంగా ఉందని తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పాకల- ఊళ్లపాలెం రహదారి కూడా గుంతలమయంగా ఉందన్నారు. గ్రామంలో పారిశుధ్య అధ్వాన్నంగా ఉందని, రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయడం ఎప్పుడో మరిచారని ప్రజలకు కలుషితనీరు అందిస్తున్నారని సమస్యలు పరిష్కరించాలని కోరారు. సర్వసభ్య సమావేశంలో లేవనెత్తిన ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదని, దీంతో సభ్యులు సమావేశానికి రావటానికి కూడా ఆసక్తి చూపటం లేదన్నారు. సీహెచ్‌ఓ పీరయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని దోమల బెడద కూడా ఎక్కువగా ఉందన్నారు. మురుగుకాల్వలో నీరు నిల్వ ఉండకుండా గ్రామ పంచాయతీ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన శాఖలైన అగ్రికల్చరల్, ఉపాధి హామి పథకం, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఎక్సైజ్ అధికారులు రాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓ డి.జయమణి మాట్లాడుతూ సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీచేస్తామన్నారు. ఎంపీటీసీలు అడిగిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని వివరించారు. ఎంపీటీసీ సోమిశెట్టి వాసవీదేవి, షేక్ షకీల, ఏపూరి శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోటార్‌బైక్, ఆటో ఢీ



ఘటనా స్థలంలో కింద పడివున్న క్షతగాత్రుడు



ఘటనా స్థలంలో ఢీకొని ఉన్న బైక్, ఆటో

పామూరు: ఎదురెదురుగా వస్తున్న మోటార్‌బైక్, ఆటో అదుపుతప్పి ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాయ్యాయి. ఈ ఘటన మండలంలోని నుచ్చుపొద వద్ద 167బీ జాతీయ రహదారి జంక్షన్ వద్ద శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బోడవాడకు చెందిన డి.యలమంద మరో వ్యక్తితో కలిసి బైక్‌పై పామూరులో సొంత పని నిమిత్తం వస్తున్నారు. అదే సమయంలో పామూరు నుంచి ఇనిమెర్ల వైపుకు ఆటో వెళ్తుండగా బైక్, ఆటో అదుపుతప్పి ఢీకొన్నాయి. ఘటనలో మోటార్‌సైక్లిస్ట్ యలమందకు ముక్కు, ముఖం, ఛాతి వద్ద గాయాలయ్యాయి. ఆటోలోని ఇద్దరికి మోస్తరు గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా ఈఎంటీ నాగబాబు, పైలెట్ వేణులు క్షతగ్రాత్రులకు ప్రథమ చికిత్స అందించి డాక్టర్ల సలహా మేరకు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.